క్లుప్తంగా

జీఎస్టీ 2.0పై అవగాహన



కలిగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర ప్రజలకు జీఎస్టీ 2.0తో కలిగే ప్రయోజనాలను వివరించారు.

హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా వెంకటేష్

సీతారామపురం : మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా ఉప్పుటూరి వెంకటేష్ నియమితులయ్యారు. గతంలో ఏఈలుగా పనిచేసిన కరీముల్లా, రామకృష్ణారావు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. వారి స్థానంలో సింగారెడ్డిపల్లె సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను ఇన్‌చార్జి నియమించినట్లుగా డీఈఈ పీరాన్ తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో వైఎస్సార్‌సీపీ మండలస్థాయి ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లుగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు మందలపు తిరుపతినాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలను పరిచయం చేయనున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మేరిగ మురళి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వీల్‌చైర్ వితరణ



ఆత్మకూరు: పట్టణంలోని 3వ వార్డు ఉలవదిబ్బ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు హజరత్తమ్మకు సాంబశివ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి వీల్‌చైర్‌ను వితరణ చేశారు. నిరుపేద వృద్ధురాలైన హజరత్తమ్మ పక్షవాతంతో నడవలేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న పరమేశ్వరరెడ్డి స్పందించి హజరత్తమ్మను తన కార్యాలయానికి పిలిపించి వీల్‌చైర్‌ను అందజేశారు. చంద్రా వెంకటసుబ్బానాయుడు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి యూరియా పంపిణీ

ఉదయగిరి: పట్టణంలోని కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నుంచి రైతులకు యూరియాను పంపిణీ చేయనున్నట్లుగా ఆ సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటస్వామయ్య గురువారం తెలిపారు. 13 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం జెరాక్స్ కాపీలతో వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

పోలేరమ్మ గ్రామోత్సవం



ఆత్మకూరురూరల్: గండ్లవేడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం నూతన విగ్రహాల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

శ్రీవారికి పల్లకిసేవ

ఆత్మకూరురూరల్: కరటంపాడు పంచాయతీ సాతానుపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు దేవదేవేరులకు పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ, సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కబడ్డీ పోటీల్లో వీఎస్‌యూ క్రీడాకారుల సత్తా



ఆత్మకూరు: అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ క్రీడాకారులు సత్తాచాటారు. దక్షిణభారతదేశ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఫైనల్‌లో కర్ణాటకలోని బెల్గావిలోని రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయంపై వీఎస్‌యూ క్రీడాకారులు ఐదు రౌండ్లలోనూ సత్తాచాటి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా నెల్లూరులోని వీఎస్‌యూ కౌన్సిల్ హాల్‌లో కబడ్డీ క్రీడాకారులను వీసీ శ్రీనివాసరావు గురువారం అభినందించారు. జట్టులో రాణించిన ఆత్మకూరు ఎస్సార్‌జేడీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఎస్సార్‌జేడీ కళాశాల పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ ఎస్ రాధాకృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నిద్రలో నిఘానేత్రం



సాయిపేటలో అలంకారప్రాయంగా సీసీకెమెరాలు



కొండాపురం సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరా

- మేజర్ పంచాయతీల్లో నేరాల నియంత్రణకు సీసీకెమెరాల ఏర్పాటు
- నిర్వహణ లోపంతో అలంకారప్రాయం

కొండాపురం : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నేరాల నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. దాతల సహకారంతో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వీటిపై పోలీసుల పర్యవేక్షణ కొరవడి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లోపంతో నిఘానేత్రాలు నిద్రపోతుండడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. మండలంలోని సాయిపేట, కొమ్మి, కొండాపురం, నేకునాంపేట, తూర్పుయర్రబల్లి, గరిమెనపెంట గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో నాలుగేళ్ల క్రితం సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని పోలీస్ స్టేషన్‌లోని కంప్యూటర్‌కు అనుసంధానం చేశారు. కొద్దిరోజుల పాటు నిరంతరం పర్యవేక్షణ చేశారు. దొంగతనాలు చేసి పారిపోయే వాళ్లను గుర్తించి పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులకు సమాచారం అందజేసి పట్టుకున్నారు. దీంతో అప్పట్లో నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల సీసీకెమెరాల నిర్వహణను గాలికొదిలేయడంతో అలంకారప్రాయంగా మారాయి. దీంతో నేరాలు పెరిగాయి. ఇటీవల గరిమెనపెంట పంచాయతీ పరిధిలోని చల్లవారిపల్లె, చల్లగిరగల గ్రామాల్లోని ఆలయాల హుండీలను దొంగలు పగులగొట్టి నగదును అపహరించారు. అలాగే చల్లవారిపల్లెలో పొలాల్లోకి గడ్డికి వెళ్లిన మహిళ కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న సుమారు మూడు సవర్ల బంగారు సరుడును దొంగతనం చేశారు. వరుస దొంగతనాలతో గ్రామాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేసినా సీసీకెమెరాల పుటేజీ లేకపోవడంతో పట్టుకోవడం కష్టంగా మారింది.

సీసీకెమెరాలు పనిచేసేలా చర్యలు



గ్రామాల్లో దాతల సహకారంతో నాలుగేళ్ల క్రితం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కొండాపురం, తూర్పుయర్రబల్లి గ్రామాల్లోని సీసీకెమెరాలు పని చేస్తున్నాయి. మిగిలిన చోట్ల సర్వీస్ లేకపోవడంతో పనిచేయడంలేదు. వీలైనంత త్వరగా సర్వీస్ చేయించి కెమెరాలను వాడుకలోకి తీసుకొస్తాం. దొంగతనాలను కట్టడి చేసేందుకు గ్రామస్తుల సహకారం అవసరం. గ్రామాల్లోని ఆలయాలు, మసీదులు, చర్చిలు, దుకాణాల వద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

–జే మాల్యాద్రి, ఎస్సై, కొండాపురం

కూటమి అరాచకాలకు మూల్యం తప్పదు



డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(అల్లూరు): కూటమి ప్రభుత్వంలో అన్యాయాలకు పాల్పడే ప్రతిఒక్కరూ తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కావలిలోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు పెట్టే అక్రమ కేసులకు పార్టీ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తే అధికారంలోకి రాగానే విచారించి చట్టపరంగా కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ప్రజల పక్షాన పోరాడేది వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. కూటమి దగా పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపైనా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రతి సమస్యపై స్పందిస్తున్న పార్టీగా రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీని చూస్తున్నారన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కావలి జెడ్పీటీసీ జంపాని రాఘవులు, పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు వాయిల తిరుపతి, నాయకులు సమీర్‌ఖాన్, దిమిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, షాహుల్ హమీద్, కలికి శ్రీనివాసులు, కుందుర్తి శ్రీనివాసులు, నాయబ్ రసూల్, వెంకట్రావు, మన్నెమాల శ్రీనివాసుల రెడ్డి, లక్ష్మణ్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ రమేష్

వింజమూరు(ఉదయగిరి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ రమేష్ అన్నారు. వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. కాగా రెండో రోజు శుక్రవారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు పీడీలు తెలిపారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, పీడీలు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, వెలుగోటి కృష్ణ, ఆర్ అంజయ్య, ఎం తిరుపాల్‌రెడ్డి, రజిని విలాసిని, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి వినతి



వింజమూరు(ఉదయగిరి): ఎంపీటీసీల విశ్వాసాన్ని కోల్పోయినా రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగుతున్న వింజమూరు ఎంపీపీ ఇనగలూరు మోహన్‌రెడ్డిపై 8 మంది ఎంపీటీసీలు కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎంపీపీకి ఎంపీటీసీల సహకారం లేనందున మండల పరిషత్ నిధులు ఖర్చుచేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అందువల్ల ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి అనుమతి ఇవ్వాలని కోరారు. మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, సుమలత, ఎంపీటీసీలు వనిపెంట హైమావతి, కాటం ప్రసన్న, ఎస్ మౌనిక, టీ పురుషోత్తం, గువ్వల మల్లికార్జున, రత్తమ్మ ఉన్నారు.

సాయిపేటలో గ్రామసభ

కొండాపురం: సాయిపేటలోని పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పీ కోటేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీల విభజనకు జీఓను విడుదల చేసిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాయిపేట మేజర్ పంచాయతీ పరిధిలోని మక్కినవారిపాళెం, వెల్లటూరువారిపాళెం, ఇస్కపాళెం, కొమ్మిపాళెం గ్రామాలను విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు గ్రామసభను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరగా గ్రామసభకు హాజరైన అందరూ పంచాయతీని విడగొట్టేందుకు అంగీకరించారు. అనంతరం పంచాయతీ వార్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా మెజార్టీ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, సీనియర్ నాయకులు లక్ష్మీనరసింహ, సాగునీటి సంఘ అధ్యక్షులు ప్రవీణ్, వల్లూరి వెంకటేశ్వర్లు, దామ శివబాబు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి



దాతలను సత్కరిస్తున్న ఎంఈఓ చలపతి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని ఆత్మకూరు ఎంఈఓ చలపతి అన్నారు. యర్రబల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని గ్రామానికి చెందిన దొడ్ల శ్రీనివాసులు, లక్ష్మీకాంతమ్మ దంపతులు సుమారు రూ.2 లక్షలు వ్యయంతో చేపట్టారు. మరో దాత దొడ్ల సుధీర్ గ్రామ యూత్ తరుపున వంటగది పునర్నిర్మాణానికి రూ.60వేలు అందజేశారు. ఈ అభివృద్ధి పనులను ఎంఈఓ గురువారం ప్రారంభించారు. అనంతరం దాతలు శ్రీనివాసులు దంపతులను సత్కరించి అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు రవికుమార్, బాలయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రుతిక పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర విధుల బహిష్కరణ



సీతారామపురంలో వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

అనుమసముద్రంపేట/సీతారామపురం: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేత పనులను నిలిపివేస్తున్నామని అనుమసముద్రంపేట, సీతారామపురం మండలాల ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు అనుమసముద్రంపేట, సీతారామపురం మండల విద్యావనరుల కేంద్రాల్లో గురువారం వినతిపత్రాలను అందజేశారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో విద్యార్థులకు సక్రమంగా పాఠాలను బోధించలేకపోతున్నామన్నారు. బోధనేత పనుల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పనులు, పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు చేపట్టబోమని తెలిపారు. ఫ్యాప్టో నాయకులు ఎడమ తిరుపతయ్య, భోగ్యం శ్రీనివాసులు, కలివెల రవిచంద్ర, రామ సుధాకర్, పేరాల శ్రీనివాసులు, ఓంకారం నరసింహారాజు, అంకబాబు,వెంకటేశ్వర్లు, సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవచూపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

సీతారామపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కాగా సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవడంపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గాలికి వదిలేసి కాగితాల్లో కాకి లెక్కలు చూపడం తగదని సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరు రాజు ధ్వజమెత్తారు. జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, వైస్‌ఎంపీపీ బసిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ చప్పిడి వెంకటమ్మ, సొసైటీ అధ్యక్షుడు సోమన బోయిన రాజశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు హైదర్‌అలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ మస్తాన్‌వలి, ఏఓ చెన్నారెడ్డి, పీఆర్, హౌసింగ్ ఏఈలు చిన్నయ్య, వెంకటేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

సంగం: మండలంలోని గిరిజనుల కోసం ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ గురువారం తెలిపారు. 13న సంగం–1, 14న జెండాదిబ్బ, 15న సిద్దీపురం, 16న మర్రిపాడు, 17న కొరిమెర్ల, 18న సంగం–1 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు రూ.12వేలు అందజేత



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్ స్పందించారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరుపున రూ.12వేలు ఆర్థిక సాయాన్ని తన ట్రస్టు సభ్యుల ద్వారా పాఠశాల హెచ్‌ఎం వీ పోతులూరయ్యకు గురువారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్లు కుమార్, వెంకటేశ్వర్లు, తోడేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన అంకిరెడ్డి

కలిగిరి: స్థానిక సాయిబాబా మందిరం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..వీరారెడ్డిపాళెం గ్రామానికి చెందిన నరాల అంకిరెడ్డి మోటార్‌సైకిల్‌పై కలిగిరి వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళుతున్నాడు. సాయిబాబా మందిరం వద్దకు రాగానే కలిగిరికి చెందిన ఓ యువకుడు మోటార్‌సైకిల్‌పై అతివేగంగా వస్తూ వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అంకిరెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. స్థానికులు, బాధితుడి బంధువులు ప్రమాదానికి కారణమైన యువకుడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

బస్సును ఢీకొన్న కారు



సీతారామపురం : స్థానిక ఎల్వీఆర్ కళాశాల సమీపంలోని ప్రధాన కూడలి వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయగిరి నుంచి సీతారామపురానికి వస్తున్న పల్లెవెలుగు బస్సును పోరుమామిళ్ల నుంచి చిన్నాగంపల్లికి వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు, కారు ముందు భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. హఠాత్తుగా ప్రమాదం చోటు చేసుకోవడంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



ఉదయగిరిలో గంధం ఊరేగింపు



దుత్తలూరులో..

ఉదయగిరి: పట్టణంలోని ఆస్థానా ఖాదరీయాలో హజరత్ గౌసులాజం దస్తగిర్ గ్యార్వీ షరీఫ్ సందర్భంగా గంధ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హజరత్ వారి ఆసారే ముబారక్ పవిత్ర చిహ్నాలను ఆస్థానాలో భక్తుల కోసం ప్రదర్శించారు. సాయంత్రం హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా ఆస్థానాకు చేర్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. రాత్రి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఖాదరియా ఆస్థాన అధ్యక్షుడు అహమద్‌బాషా ఖాలిది, మిఠాయిగిరి అహమద్, ఫరుద్దీన్, ఉస్మాన్‌అలీ, నజీర్,జలీల్, జిల్లా మైనారిటీ నాయకుడు రియాజ్ పాల్గొన్నారు.

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో మహబూబ్ సుభానీ గంధ మహోత్సవాన్ని గురువారం వేకువజామున వైభవంగా నిర్వహించారు. తొలుత హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

వింజమూరు పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి కే రామారావు, సర్పంచ్ సృజన తెలిపారు. వింజమూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో సీసీరోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, ఇతర అవసరాలకు పంచాయతీ నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. పంచాయతీ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వింజమూరు పంచాయతీకి స్వచ్ఛ పురస్కారం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించి తమ ఇళ్లలోని తడి.పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు.

సీజేఐపై దాడికి యత్నం దారుణం



ఆత్మకూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం దారుణమని యూత్ కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు ఆధ్వర్యంలో సీజేఐపై దాడిని ఖండిస్తూ గురువారం నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగం, శాసన వ్యవస్థలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలన్నారు. తొలుత అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కే తిరుపాలు, చలపతి, కామేశ్వర్, ఎస్‌డీ రసూల్, పీ మణి, టీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



బాలాజీ సీడ్స్‌లో తనిఖీలు చేపడుతున్న అధికారులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ స్క్వాడ్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి గోదాముల్లోని నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొదలకూరు ఏడీఏ శివ నాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, వ్యవసాయాధికారిణి ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దుకాణదారులు రైతులకు నిబంధనల మేరకు విక్రయాలు జరుపుతున్నారా.. లేదా అని పరిశీలించామన్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయించినా, స్టాక్‌ను తప్పుదోవ పట్టించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీఏ శేషగిరిరావు, ఏఓ వాసు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 25వ తేదీలోగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఏడీఏ చెన్నారెడ్డి సూచించారు. గురువారం ఆయన ఉదయగిరి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈక్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వీఏఏలను కలిసి రైతులు పంటలు నమోదు చేసుకోవాలని కోరారు.

అమరలింగేశ్వరుడిగా విశ్వేశ్వరస్వామి



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి జ్ఞానపీఠంలో లోకకళ్యాణం కోసం 45రోజుల పాటు చేపడుతున్న యాగంలో భాగంగా 17వ రోజు గురువారం కాశీవిశ్వేశ్వరస్వామిని అమరలింగేశ్వరుడిగా అలంకరించి పంచసూక్త సహిత రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.